క్లుప్తంగా

ఆ మామిడి పండ్లు ప్రమాదకరం

డీసీపీసీ సభ్యుడు అనంతరావు



రాజమహేంద్రవరం సిటీ: మామిడి పండ్ల వ్యాపారులు కొంతమంది చట్టవిరుద్ధంగా కాల్షియం కార్బైడ్‌ను ఉపయోగించి పచ్చి మామిడి కాయలను కృత్రిమంగా పండించి, మార్కెట్‌లో అమ్ముతున్నారని, ఇవి ప్రమాదకరమని జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు తెలిపారు. ఆదివారం నగరంలో కన్స్యూమర్ వాయిస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. కాల్షియం కార్బైడ్ అనేది ప్రమాదకరమైన రసాయనమని, దానివల్ల మనిషి ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం పడుతుందన్నారు. దీనిపై చర్యలు చేపట్టాలని ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారు ఇటీవల అన్ని రాష్ట్రాలకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఆహార భద్రత ప్రతి వినియోగదారుని హక్కు అని, ఆ హక్కులు కాపాడేందుకు కృషి చేస్తామన్నారు. ఆహార భద్రత అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలని, పండ్ల వ్యాపారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎలాంటి ఫిర్యాదులైనా తమ వద్దకు వస్తే జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



రాజమహేంద్రవరం రూరల్: వెంకటనగరం గ్రామంలోని సాయిబాబా ఆలయ మందిరం 28వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, బాబావారి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అర్చకులు సదాశివకుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

ప్రాపంచిక సత్యం అమ్మ



విజేతకు సర్టిఫికెట్ అందజేస్తున్న అసదుల్లా అహ్మద్ తదితరులు

సీటీఆర్ఐ: భగవద్గీత, ఖురాన్, బైబిల్, ఏ మత గ్రంథమైనా, ఏ భాషలోనైనా అమ్మ ప్రాపంచిక సత్యమని ఆంధ్రకేసరి డిగ్రీ కళాశాల చైర్మన్ అసదుల్లా అహ్మద్ అన్నారు. ఆంధ్రకేసరి యువజన సమితి ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వారోత్సవాల కార్యక్రమం స్వాతంత్య్ర సమరయోధుల పార్కులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్య్ర సమరయోధుల మహిళామణుల విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అమ్మతో సెల్ఫీ పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. వక్తలు సమితి అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామనాయుడు, సమితి కార్యదర్శి మాదిరాజు శ్రీనివాస్, సహ నిర్వాహకులు వాసవీ క్లబ్ ఉపాధ్యక్షుడు కె.వీరభద్రరావు, సాధ్వీ ఫౌండేషన్ అధ్యక్షురాలు కాత్యాయిని, బ్రాహ్మణ సాధికారిక సంస్థ అధ్యక్షురాలు ఏమూరి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వెల్డింగ్ షాపు నిర్వాహకుడి అదృశ్యం



నాగమల్లేశ్వరరావు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి వెళ్లిన తన భర్త తిరిగిరాలేదని లాలా చెరువు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన పునగంటి కేదారేశ్వరి ఆదివారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన 37 ఏళ్ల పునగంటి నాగమల్లేశ్వరరావు ఆటోనగర్‌లో వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. రెండు నెలల క్రితం కుమార్తెకు వివాహం చేయడంతో కొంత అప్పు ఉంది. దీంతో అతని భార్య కేదారేశ్వరి భర్త నాగమల్లేశ్వరరావును అప్పు తీర్చమని ఈ నెల 17న అడిగింది. దీంతో భార్యతో గొడవపడి అతడు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. అతడు తిరిగి రాకపోవడంతో, తెలిసిన చోట్ల వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదు. సెల్‌ఫోన్ కూడా పనిచేయలేదు. ఎస్సై బి.శ్రీను కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తక పఠనంతో ఎంతో మేలు

రంగంపేట: విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే ఎంతో మేలు జరుగుతుందని గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల మానవతా విలువలు, మంచి వ్యక్తిత్వం, క్రమశిక్షణ అలవడతాయన్నారు. విద్యార్థులందరూ వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో యోగా, సూర్య నమస్కారాలు చేయించారు. నీతి కథలు, భక్తి గేయాలు, ఇంగ్లిష్ రైమ్స్ విద్యార్థులకు నేర్పించారు.

అమృతంలో నిర్లక్ష్యపు గరళం

క్షీరసాగర మథనంలో అమృతం కోసం దేవతలు, రాక్షసులు భీకర యుద్ధం చేసుకున్నట్టు పురాణ గాథ. అమరత్వం దాగి ఉన్న ఆ అమృతం విలువ అంతటిది. అమరత్వం మాట పక్కన పెడితే.. శిశువుల్లో ఎదుగుదలను, వారిలో రోగ నిరోధక శక్తిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బాలామృతం పౌష్టికాహారాన్ని అందజేస్తోంది. ఎన్నో పోషక విలువలు కలిగిన, ఎంతో విలువైన ఈ బాలామృతం ప్యాకెట్లు రాజమహేంద్రవరం నగరంలోని ఓ చెత్త కుండీలో దర్శనమిచ్చాయి. దీని వెనుక కచ్చితంగా నిర్లక్ష్యం దాగిఉంది. ఈ వ్యవహారం ఏమిటో సంబంధిత అధికారులే నిగ్గు తేల్చాల్సి ఉంది.



నగరపాలక సంస్థ పారిశుధ్య వాహనంలో పడేసిన బాలామృతం ప్యాకెట్

- చెత్తకుండీల పాలవుతున్న బాలామృతం
- ఐసీడీఎస్ అధికారుల ఉదాసీనం
- అంగన్‌వాడీల నిర్లక్ష్య వైఖరిపై విమర్శలు



మార్చి 29న తయారైనట్టు ముద్రించి ఉన్న బాలామృతం

రాజమహేంద్రవరం సిటీ: చిన్నారులకు అందించే బాలామృతం చెత్తకుప్పలపాలవుతోంది అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఆరు నెలలు దాటి, మూడేళ్ల లోపు చిన్నారులకు బాలామృతం పేరిట రెండున్నర కిలోల పౌష్టికాహారాన్ని ప్రతి నెలా పంపిణీ చేస్తోంది. ఇలా పంపిణీ చేసిన బాలామృతం ప్యాకెట్లు సద్వినియోగం అయ్యిందీ, లేనిదీ పర్యవేక్షించాల్సిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, సూపర్‌వైజర్లు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే లబ్ధిదారులు ప్రభుత్వం అందించిన బాలామృతాన్ని నిర్లక్ష్యంగా బయట పడేస్తున్నారు. రాజమహేంద్రవరం నగరంలో పంపిణీ అవుతున్న బాలామృతం పూర్తిగా వినియోగించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాలామృతం ప్యాకెట్లు తీసుకున్న కొందరు కొన్నిచోట్ల పశువులకు దాణాగా పెడుతున్న సంఘటనలు కనిపిస్తునాయి. కేవలం పర్యవేక్షణా లోపం కారణంగానే ఇలాంటి దుస్థితి నెలకొంటోందని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఆదివారం క్వారీ ఏరియాలో ప్రభుత్వం అందజేసిన బాలామృతం ప్యాకెట్ నగరపాలక సంస్థ పారిశుధ్య వాహనం వద్ద ప్రత్యక్షమైంది.

ప్రతి నెలా ఆరు నెలల శిశువుల నుంచి మూడేళ్ల చిన్నారులకు అంగన్‌వాడీల ద్వారా రెండున్నర కిలోల బాలామృతం, 25 కోడిగుడ్లు, రెండున్నర లీటర్ల పాలు అందజేస్తున్నారు. ఇలా సరఫరా చేసిన బాలమృతం ప్యాకెట్‌లో ఎన్నో పోషక పదార్థాలు, విటమిన్లు, ఐరన్, జింక్ వంటివి ఉంటాయి. వాటిపై లబ్ధిదారులకు ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీలు సరైన అవగాహన కల్పించడం లేదంటున్నారు. సరైన అవగాహన లేకపోవడం వల్లనే బాలామృతాన్ని ఉదాసీనంగా పారేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు నెలల పాటు నిల్వ ఉండేలా బాలామృతాన్ని రూపొందిస్తున్నారు. క్వారీ ఏరియాలో లభ్యమైన ప్యాకెట్ 2024 మార్చి 29వ తేదీన తయారై, జూన్ 29వ తేదీ వరకూ వినియోగించే అవకాశం ఉన్నట్టుగా ఉంది. ఐసీడీఎస్ ద్వారా సరఫరా అవుతున్న బాలామృతం సక్రమంగా వినియోగిస్తున్నారా, లేదా అనేది కనీసం పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీల ద్వారా సరఫరా చేస్తున్న బాలామృతం వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎంతో విలువైన ఈ పౌష్టికాహారం చెత్తకుప్పల పాలు కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఐసీడీఎస్ సీడీపీఓ నరసమ్మను వివరణ కోరగా, సంఘటనను పరిశీలిస్తామని చెప్పారు.

పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలి



అంగన్‌వాడీల ద్వారా సరఫరా అవుతున్న బాలామృతం ఏ మేరకు సద్వినియోగం అవుతుందనే విషయంపై విచారణ నిర్వహించాలి. నగరంలో ఇది పంపిణీ అవుతున్న ప్రాంతాలపై దృష్టి సారించాలి. జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించి, తగిన చర్యలు తీసుకోవాలి.

-వై.రామకృష్ణ, రాజమహేంద్రవరం

కలెక్టర్ దృష్టి పెట్టాలి



పేదలకు అందిస్తున్న బాలామృతం క్షేత్రస్థాయిలో జరుగుతున్న వినియోగంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టాలి. పేదలు అధికంగా నివసించే క్వారీ ఏరియాలో ఈవిధమైన పరిస్థితి ఉంటే, నగరంలో మిగిలిన చోట్ల ఏవిధమైన వినియోగం జరుగుతుందనే విషయంపై దృష్టి సారించాలి.

– డి.రామకృష్ణారెడ్డి, రాజమహేంద్రవరం

పెట్రోల్, డీజిల్ విడిగా విక్రయించవద్దు

సీఐ వినయ్‌మోహన్

ధవళేశ్వరం: వాహనాలకు బంకుల్లో మినహా విడిగా పెట్రోల్, డీజిల్‌ను విక్రయించవద్దని ధవళేశ్వరం సీఐ జీవీ వినయ్‌మోహన్ స్పష్టం చేశారు. బంకుల్లో టిన్లు, డ్రమ్ములు, బాటిల్స్‌లో పెట్రోల్ అమ్మడం నిషేధించినట్టు చెప్పారు. ధవళేశ్వరం, రాజవోలు గ్రామాల్లో ఉన్న పెట్రోల్ బంకుల యాజమానులు జిల్లా అధికారుల ఉత్తర్వులు పాటించాలన్నారు. ఎన్నికల అనంతరం జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఆదేశాలు జారీ చేశారన్నారు. గ్రామాల్లో చిన్న బడ్డీ కొట్ల వద్ద బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ అమ్మడం నేరమన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధవళేశ్వరం, రాజవోలులో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు బాణసంచా తయారీ, విక్రయాలు, కొనుగోలు చేయడాన్ని నిషేధించారన్నారు. ఏ కార్యక్రమమైనా బాణసంచా కాల్చినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మోటారు సైకిళ్లకు ఎక్కువ శబ్దం వచ్చే సైలెన్సర్లు అమర్చినా, సైలెన్సర్లు తొలగించినా మెకానిక్‌లపైనా, ఆ మోటారు సైకిళ్ల యజమానులపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలు స్వాధీనం చేసుకుంటామన్నారు. ధవళేశ్వరం, రాజవోలులో ఎవరైనా అనుమానాస్పదంగా పేలుడు పదార్థాలు, మారణాయుధాలు కలిగి ఉన్న, రవాణా చేసినా, దాచి ఉంచినా ఆ వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఇసుక రీచ్‌ను పరిశీలించిన కలెక్టర్



కడియపులంక-వేమగిరి ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మాధవీలత, ఇతర అధికారులు

కడియం: ఇసుక తవ్వకాలు, తరలింపుపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు ఆదివారం కడియపులంక-వేమగిరి ఇసుక రీచ్‌ను జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత, అధికారుల బృందంతో కలిసి పరిశీలించారు. మధ్యాహ్నం నుంచి వర్షంలో తడుస్తూనే క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. ఇసుక తవ్వకాల నేపథ్యంలో ఓపెన్ రీచ్‌లు, బోట్స్‌మ్యాన్ సొసైటీ, డ్రెడ్జింగ్ పనులపై వస్తున్న ఫిర్యాదుల మేరకు అధికారులతో కలిసి ఈ పరిశీలన చేశామని జిల్లా కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఈ నివేదికను హైకోర్టుకు సమర్పిస్తామని చెప్పారు. ఆమె వెంట జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి, మైన్స్ ఏడీ ఎం.సుబ్రహ్మణ్యం, సెబ్ జిల్లా అధికారి పిట్టా సోమశేఖర్, గ్రౌండ్ వాటర్ డీడీ వై.శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, ఇరిగేషన్ అధికారి ఆర్.కాశీవిశ్వేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వర్షంతో ఆరుతడి పంటలకు ఊపిరి

రంగంపేట: వేసవి ఉష్ణోగ్రతలతో సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న ఆరుతడి పంటలకు ఆదివారం కురిసిన వర్షం ఊపిరి పోసింది. వర్షం ప్రభావంతో మెట్ట ప్రాంతం తడిసి ముద్దయ్యింది. దీంతో ఆరుతడిగా సాగయ్యే ఉద్యాన పంటలైన కూరగాయలు, మిరప, మొక్కజొన్న, పామాయిల్, నిమ్మ పండ్ల తోటలకు నీరందింది. రంగంపేట, వడిశలేరు, కోటపాడు, సింగంపల్లి, మర్రిపూడి, నల్లమిల్లి, జి.దొంతమూరు, ఈలకొలను, ముకుందవరం తదితర గ్రామాల్లో సాగు చేస్తున్న ఉద్యాన పంటలకు మేలు చేకూరిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

శివజ్యోతిలో చిత్ర యూనిట్ సందడి



త్రిమూర్తులును సత్కరిస్తున్న త్రివిక్రమరావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అక్కడ వారు ఇక్కడ ఉన్నారు.. చిత్ర యూనిట్ స్థానిక శివజ్యోతి థియేటర్‌లో శనివారం సెకండ్ షో సమయంలో సందడి చేసింది. దర్శక, నిర్మాత కందుర్తి త్రివిక్రమరావు మాట్లాడుతూ ఈ సినిమాను అతి తక్కువ బడ్జెట్ కేవలం రూ.20 లక్షలతో, అత్యంత సాంకేతిక విలువలతో, పది రోజుల సింగిల్ షెడ్యూల్‌లో నిర్మించినట్టు వివరించారు. నూతన నటీనటులైనా అద్భుత నటనతో ప్రేక్షకులను అలరించారన్నారు. సంగీతం శ్రీవెంకట్, కెమెరామన్ రాజుకేశన్న, ఎడిటర్ వెంకట్ పని చేశారన్నారు. సాయిహర్షిణి, ఎస్వీ.రమణ, కేవీ రమణ, పి.లలిత, పిల్లి విజయకుమార్, లక్ష్మణరావు, కరణం ఈశ్వర్, కంతి త్రిమూర్తులు, వట్టిపల్లి శ్రవణ్, వరాలబాబు, కడియం మంజు ముఖ్యపాత్రలు పోషించారన్నారు. ఈ సందర్భంగా క్యారెక్టర్ నటుడు కంతి త్రిమూర్తులను త్రివిక్రమరావు సత్కరించారు.

సత్యనారాయణ సేవలు ఆదర్శనీయం

డీపీఓ దాసరి రాంబాబు



సత్యనారాయణ, మల్లిక దంపతులను సత్కరిస్తున్న డీపీఓలు

రాజమహేంద్రవరం రూరల్: వీడీఓ నుంచి అంచెలంచెలుగా ఎదిగి డీఎల్‌పీవోగా, జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా విధి నిర్వహణలో అంకిత భావంతో జాన సత్యనారాయణ చేసిన సేవలు ఆదర్శనీయమని డీపీఓ దాసరి రాంబాబు అన్నారు. ఆదివారం బొమ్మూరులోని చెరుకూరి కన్వెన్షన్ హాల్‌లో ఏపీ పంచాయతీ కార్యదర్శుల సంఘం, ఏపీ పంచాయతీ విస్తరణాధికారుల సంఘం తూర్పుగోదావరి జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో విశ్రాంత డీఎల్‌పీఓ జాన సత్యనారాయణ పదవీ విరమణ ఆత్మీయ అభినందన, సన్మాన సభ జరిగింది. ముఖ్యఅతిథి దాసరి రాంబాబు మాట్లాడుతూ జాన సత్యనారాయణ నూతనంగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లాకు తొలి జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా ఎనలేని సేవలు అందించారన్నారు. కాకినాడ జిల్లా డీపీఓ కె.భారతి సౌజన్య, డీఎల్‌పీఓలు నాగలత, బొజ్జిరాజు, భమిడి శ్రీరామ్, విశ్రాంత విస్తరణాధికారి కేవీ రాఘవులు, ఈఓపీఆర్డీ ఆర్మ్‌స్ట్రాంగ్, వెంకటరత్నం తదితరులు సత్యనారాయణ సేవలను కొనియాడారు. అనంతరం సత్యనారాయణ, మల్లిక దంపతులను ఘనంగా సత్కరించారు. జిల్లా కలెక్టర్ డా.మాధవీలత ప్రోత్సాహంతోనే విజయవంతంగా విధులు నిర్వహించగలిగానని జాన సత్యనారాయణ పేర్కొన్నారు. విధి నిర్వహణలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ కేపీ చంద్రశేఖర్, ఎంపీడీఓ కె.రత్నకుమారి, డీపీఓ కార్యాలయ పరిపాలనాధికారి జగదీశ్వరి, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దుక్కి దున్నితే భూమికి దన్ను

- లోతు దుక్కి వల్ల ఎన్నో లాభాలు
- మెట్ట ప్రాంత పొలాలకు మరింత మేలు



పొలంలో వేసవి దుక్కు చేస్తున్న రైతు

రంగంపేట: మండే ఎండను పండే పంటకు ఉపయోగించుకోవచ్చు. ఖాళీగా వదిలేస్తే కలిసొచ్చేది లేదు గాని నష్టాలు మాత్రం ఉంటాయి. ఖరీఫ్ సీజన్ రాబోతోంది. ఈ సమయంలో రైతులందరూ ఏ పంట వేస్తే బాగుటుంది, ఏ రకం విత్తనాలు ఎంచుకోవాలి, ఏయే ఎరువులు సిద్ధం చేసుకోవాలి అని ఆలోచిస్తుంటారు. రాబోయే పంటల కోసం ఇప్పటి నుంచే వనరులు సిద్ధం చేసుకోవడం ద్వారా ఎటువంటి ఇబ్బందులు లేకుండా పంటలను సాగు చేసుకునే వీలుంటుంది. అయితే వీటన్నిటి కంటే ముందు వేసవిలో పొలాలను ఖాళీగా వదిలేయకుండా లోతు దుక్కులు చేయడం ద్వారా రానున్న పంటల్లో మంచి దిగుబడులు వచ్చే అవకాశముంటుంది.

ఎన్నో ప్రయోజనాలు

- రైతులు వేసవిలో భూసార పరీక్షలు చేయించుకోవడం, భూమిని శుభ్రం చేసుకోవడం, లోతు దుక్కులు వంటి ముందస్తు చర్యలు చేపట్టడం ద్వారా రానున్న ఖరీఫ్‌లో రైతులు మంచి ఫలితాలను రాబట్టుకునే వీలుంటుంది.
- సాగు చేయబోయే పంట కోసం సాధారణంగా కల్టివేటర్(ట్రాక్టర్‌కు వాడే మామూలు నాగలి) బదులుగా లోతు దుక్కి దున్నడానికి రెక్క నాగలి, బల్లెపు నాగలి, గునపపు నాగలి వాడితే నేల 30 నుంచి 75 సెంటీమీటర్ల లోతుకు దిగి ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయి.
- వాలుకు అడ్డంగా దుక్కి చేయడం వల్ల భూమి కోతకు గురి కాకుండా తేమ పెరగడమే కాకుండా ఎక్కువ కాలం తేమ తగ్గకుండా ఉంటుంది.

ప్రస్తుతం పొలాలు ఖాళీగా ఉండటం వల్ల కలుపు మొక్కలు విపరీతంగా పెరిగి పొలంలో నాటుకుపోతాయి. దానివల్ల రానున్న పంటలకు కలుపు బెడద ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి పొలంలోనూ వేసవిలో దుక్కులు దున్నాలి.

- మామూలు నాగలితో కంటే ప్రత్యేకంగా ఉన్న నాగళ్లను ఉపయోగించడం ద్వారా పొలంలో ఒక అడుగుకు పైగా లోతు దుక్కి చేయడానికి వీలు కలుగుతుంది.
- వేసవిలో ట్రాక్టర్ల ద్వారా లోతు దుక్కులు చేయడం వల్ల పంట పొలాలకు ఎంతో మేలు. ముఖ్యంగా మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలో భూములకు ఈ లోతు దుక్కులు ఎంతగానో ఉపయోగం.
- వాలుకు అడ్డంగా లోతు దుక్కి దున్నడం వల్ల నేలలో తేమకు రక్షణ ఉంటుంది. భూమి గుల్లబారి వర్షపు నీరు సమృద్ధిగా భూమిలోకి ఇంకి ఎక్కువ కాలం పంటలకు తేమను అందిస్తుంది.

చీడపీడల నివారణ



లోతు దుక్కి వల్ల భూమి లోపలి పొరలు బయటపడి సారవంతంగా మారుతుంది. ముఖ్యంగా మెట్టప్రాంతాల్లో పత్తి సాగు చేసే భూమిని వేసవిలో దుక్కి దున్నడం వల్ల పంటకు నష్టం కలిగించే ఎరువు, గులాబీ రంగు పురుగులు ఆదిలోనే నశించి రైతులకు నష్టం వాటిల్లకుండా ఉంటుంది. దీనివల్ల భూమిలోని చీడ పీడలను నివారించవచ్చు.

– కె.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి, రంగంపేట మండలం


- పంట కాలంలో చీడపీడలు, పురుగుల అవశేషాలు బయటపడి ఎండ వేడికి చనిపోయి వచ్చే సీజన్‌లో పురుగుల బెడద తప్పుతుంది.

శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణం



అనపర్తి కెనాల్ రోడ్డులోని శ్రీవారి ఆలయ ప్రాంగణంలో స్వామి వారి కల్యాణ క్రతువును జరిపిస్తున్న పండితులు

అనపర్తి: స్థానిక కెనాల్ రోడ్డులో వేంచేసివున్న అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం ఆదివారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. వేద పండితులు బ్రహ్మశ్రీ రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు భోగేశ్వర శర్మ, త్రినాథశర్మల పర్యవేక్షణలో నిర్వహించిన శ్రీవారి కల్యాణ క్రతువును మహేంద్రవాడకు చెందిన సత్తి పాపిరెడ్డి అరుణ దంపతులు జరిపించారు. అదేవిధంగా స్థానిక పాతవూరులోని ఉమారామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో వైశాఖ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీనివాస కల్యాణాన్ని పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని శ్రీవారి కల్యాణాన్ని తిలకించారు.



ప్రత్యేక అలంకరణలో అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామివారు

సినిమాలు



శ్యామల	ఆ ఒక్కటీ అడక్కు
సూర్యమినీ	కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
సూర్యప్యాలస్	అపరిచితుడు
స్వామి	కృష్ణమ్మ
శివజ్యోతి	గీతాంజలి మళ్లీ వచ్చింది, అక్కడ వారు ఇక్కడ ఉన్నారు
అనుశ్రీ	ది గ్యారీఫీల్డ్ మూవీ
రాజా	రత్నం
ఊర్వశి	బాక్
రంభ	మిరల్
మేనక	నటరత్నాలు, ప్రసన్నవదనం
అప్సర	కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ దిఏప్స్
కుమారి	ఆది
నామవరం	
వీఎస్ మహల్	కృష్ణమ్మ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	అపరిచితుడు, కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
కడియం	
వెంకటసూర్య	ఆ ఒక్కటీ అడక్కు

మామిడి ధర అదరహో..



తాళ్లపూడిలో విక్రయిస్తున్న మామిడి పండ్లు

- సామాన్యుడికి అందుబాటులో లేని మధుర ఫలం
- రకాన్ని బట్టి ఒకొక్కటి రూ.20 నుంచి రూ.30 వరకూ పలుకుతున్న ధర

తాళ్లపూడి: వేసవిలో మాత్రమే లభించే మధుర ఫలం మామిడి. మామిడి పండును ప్రజలు ఇష్టంగా తింటారు. అయితే రేటు ఎక్కువగా ఉండడంతో సామాన్యుడు దాని వైపు కన్నెత్తి చూడలేక పోతున్నాడు. ఇటీవల మామిడి పండ్లను కృత్రిమ రసాయనాలతో మగ్గిస్తున్నారు. దీంతో రుచి అంతగా ఉండడం లేదని కూడా పలువురు అంటున్నారు. ఈ ఏడాది మామిడి దిగుబడులు తగ్గడంతో ధరలు చుక్కల్లోకి చేరాయి. పైగా కాసిన కొద్దిపాటి కాయలు ఈదురు గాలులకు చెట్ల నుంచి నేల రాలుతున్నాయి. ఒక్కో మామిడి పండును రూ. 20 నుంచి రూ.30 ధరకు విక్రయిస్తున్నారు. పరక (13 కాయలు) ధర రకాన్ని బట్టి, వాటి సైజును బట్టి రూ.250 నుంచి రూ.350 వరకూ ధర పలుకుతోంది. ప్రజలు ఇష్టంగా తినే చెరకు రసాలు సైజును బట్టి రూ.250 నుంచి రూ.300 వరకూ వ్యాపారులు అమ్ముతున్నారు. బంగినపల్లి రూ.200 నుంచి రూ.250, పంచదార కలశ రూ.250 నుంచి రూ.300, సువర్ణరేఖ రూ.250 వరకూ ధర పలుకుతున్నాయి. ఇతర రకాల పండ్ల ధరలు కూడా ఇదే రీతిలో ఉన్నాయి. ధర పెరిగినా కూడా మామిడిపండ్ల ప్రియులు మాత్రం ఇష్టంగా కొనుగోలు చేసి తీసుకు వెళుతున్నారు.